# ఆ తండ్రి కథ

జె. స్వర్ణలత



తెల్లని సిల్కు చీరలు ధరించిన అందమైన ఆడపిల్లల్లా ఉన్న మేఘాలు మెల్ల మెల్లగా అదృశ్య మవుతున్నాయి. వాళ్ళని తరుముకొస్తున్న ఏనుగుల గుంపులా కారుమేఘాలు. అంతవరకూ వెలుగుతున్న ఆకాశం తగలబడ్డ ఇల్లులా తయారవుతోంది.

విశ్వనాథం నిటారుగా నిలబడటానికి మొరాయిస్తున్న నడుము మీద చెయ్యి దన్నుగా నిలుపుకుని, అరచేతిని కళ్ళ కడ్డం పెట్టుకుని ఆకాశంలోకి చూశాడు. ఎండ మాగన్నుగా ఉంది. గాలివాటంలో కూడా మార్పు వచ్చింది. పడమటి వైపునుంచి భూమిని తాకుతూ దుమ్ము రేపుతూ ఒక్కసారి పైకి లేచిన గాలి తుమ్మచెట్ల మధ్య నుంచి తాడిచెట్ల తలల్ని తంతోంది. ఆ విసురులో సన్నగా వినిపిస్తున్న వికృతమైన ఈళ వినగానే విశ్వనాథం గుండె జల్లుమంది. నడుము విరిగినట్లయి మెల్లగా గట్టుమీద చతికిలబడ్డాడు.

మళ్ళీ తుపానా? సముద్రం గుండెల్ని కెలికి, ఆ నీళ్ళన్నీ రైతుల నెత్తిమీద కుమ్మరించే ఈ మహారాక్షసి ఏం చేస్తే శాంతిస్తుంది? అనంతమైన కలల్ని కష్టాల్ని కలిపి, డబ్బుతో కుదురు చేసి, డబ్బు నీళ్ళలా పోసి అపురూపంగా పెంచుకురావాల్సిన ఏడిత్తుల రాకుమారి ప్రత్తి మొక్క. కనికరిస్తే కనక మహాలక్ష్మి. లేదూ... ఇనుప గజ్జెల పెద్దమ్మ. అలాంటి పైరుని నమ్ముకుని బ్రతుకుమీద లాటరీ వేసుకుంటున్న సుందరా న్ననుకోవాలి. రెండు తరాల కింద రైతు నిలబడి

నీళ్ళు తాగేవాడు. కుదురుగా జీవితాన్ని లాక్కొచ్చేవాడు. తన తండ్రి, తను సుఖంగా బ్రతకలేదూ? తను చదువుకుని ఊళ్ళోనే టీచరుగా పని చేస్తూ, వ్యవసాయం కూడా చూసుకునేవాడు. ఉన్న మడిచెక్కలో నాలుగు రకాల పంటలు వేసుకునేవారు. ఇంట్లో అపరాలు, తిండి గింజలు, దోసలు, వేరుశనగ - దేనికీ లోటుండేది కాదు. తా మింత తిని ఇంకొకళ్ళకి పెట్టే పరిస్థితిలో ఉండేవారు. తన హయాంలోనూ పొగాకు పంట వచ్చింది. అయితే అన్నింటితో పాటు దాన్నీ వేసేవాడు కాని దాని మీదే ఆధారపడేవాడు కాదు. ఇప్పుడు నాలుగు రకాలు పోయి ఒకే ఒక్కటి. కాష్ క్రాప్... ప్రతిదీ కొనుక్కుని తినడం.

డబ్బు వెదజల్లి మళ్ళీ రూపాయలు మూట కట్టుకోవడం బాగానే ఉంటుంది. ఎవరు కాదంటారు? కాని వెదజల్లిన డబ్బు వెనక్కి తిరిగి రాకపోతే బడుగు రైతైనా, మోతుబరైనా చేసే దేముంది? అలా ఇప్పటికి మూడేళ్ళుగా ఉన్నదంతా ఊడ్చి పెట్టుబడి పెట్టిన రైతు ఫలితం దొరక్క ఒడ్డున పడ్డ చేపలా గిలగిల్లాడిపోతున్నాడు.

ఆలోచిస్తున్న విశ్వనాథం తెల్లని తెరచాపలా ఒక్కసారి శరీరాన్ని తాకిన వర్షపు తెరకి ఈ లోకంలో కొచ్చాడు. తలమీద నుంచి కారుతున్న నీటిలో రెప్పల అంచుల్నుంచి దొర్లుతున్న అశ్రుకణాలు కలిశాయి. భారంగా లేచి ఊరి వైపు నడక సాగించాడు. ఇంకా ఉధృతమైతే ఇక్కడే చిక్కడిపోవాలి.

వాగు దగ్గర కొచ్చేసరికి మరి కొందరు రైతులు కలిశారు. వాళ్ళ మొహాల్లో నైరాశ్యం నీలినీడలు.

"రాత్రి రేడియోలో ఏమీ చెప్పలేదు. ఇదేదో ఉడుకు జల్లు" అన్నా డో ఆశావాది.

ఎవరూ మాట్లాడలేదు. వాళ్ళకి తెలుసు అది మామూలు వానజల్లు కాదని. బ్రతుకుల్ని గాల్లోకి లేపి కిందకి ఈడ్చికొట్టే పెనురాక్షసని. వాగు ఒడ్డున రాక్షస దళాల్లా ఈతలు.

"దేని కొచ్చిన ఎగసాయం? ఈతచెట్లకి నాలుగు కుండలు కట్టుకున్నా బ్రతుకెల్లదా?" వ్యవసాయ వైరాగ్యం.

ఇల్లు చేరుకునేసరికి నిలువునా తడిసిపోయాడు విశ్వనాథం. దండెం మీదున్న తుండుతో తల శుభ్రంగా తుడుచుకుని, పొడి బట్టలు కట్టుకుని, మంచం వాల్చుకుని కూర్చున్నాడు.

వంటింట్లోంచి కోడలు వర్ధని బయటి కొచ్చింది. ఆమె కళ్ళ నిండా ఏదో బాధ.

"ఇది తుపా నంటారా మామయ్యా?" అంది భూమికీ, ఆకాశానికీ నీటి పరదా దించుతున్న వర్షాన్ని తదేకంగా చూస్తూ.

"సుందరం రాలేదా?"

"మందు కట్టలకోసం వెళ్ళారు. కుంటి గురవయ్యా కనబడితే గొడుగిచ్చి పంపండి. సుబ్బలక్ష్మి కొట్లో ఇచ్చేస్తాడు." ఆమె తిరిగి లోపల కెళ్ళిపోయింది.

చీకటి పడింది. గాలి జోరు పెరిగింది. ఝంఝామారుతం ఇంటి కప్పుమీద వికారంగా ఈలలు వేస్తోంది. కరెంట్ పోయింది.

వర్ధని కోడిగుడ్డు దీపం వెలిగించి, ముక్కాలి పీటమీద పెట్టి అక్కడే కూర్చుంది. ఆ కాంతి ఆమె శరీరం మీద పల్చగా అలుముకుంటూంది. భర్త



డిజైన్: సునీత సింగ్

ఇంకా ఇల్లు చేరనందుకో, విషమిస్తున్న ఆర్థిక పరిస్థితికో మొహం వాడిన పువ్వులా ఉంది.

"వంట్లో బావుంటోం దమ్మా?" అన్నాడు విశ్వనాథం ఆప్యాయంగా.

బాగానే ఉందన్నట్లుగా తలాడించింది. ఇప్పు డామె గర్భవతి.

"ఈ సంవత్సరం కిందటి సంవత్సరంలా అయితే..." ఆమె గొంతు వణికింది.

"అయితే?"

ఆ ప్రశ్నకి సమాధానం లేదు. అంతులేని శూన్యం. వికృతంగా కదుల్తున్న అప్పుల భారం. అప్పు తీర్చడం అంటే? నిండుగా పేర్చిన కట్టెలతో బరువుగా వస్తున్న బండిని చూసి రోడ్డు మధ్యలో నడక రాని పాపాయి కంగారుపడి, గుక్కపడి ఏడ్చినట్లు... అలాగే ఉంది తమ పరిస్థితి. నిట్టూర్చాడు విశ్వనాథం.

పైట చెంగుతో కళ్ళద్దుకుంది వర్ధని. డబ్బవసరం అంటే వేరే మార్గం లేక... చూస్తూ ఊరుకోలేక చెల్లెలు గొలుసు తెచ్చి భర్త చేతి కిచ్చింది. దాన్ని బాంక్‌లో తాకట్టు పెట్టి డబ్బు తెచ్చి అవసరం గడుపుకున్నారు. నిన్న సాయంత్రం తమ్ముడు కబురు తెచ్చాడు - 'అర్జెంటుగా గొలుసు కావా'లని. పెళ్ళయిన పిల్ల. అవతల ఆమె భర్త మాత్రం ఎన్ని రోజు లూరుకుంటాడు? ఈ సంవత్సరం పైరు బావుంటే సగం అప్పులైనా చెల్లుబెట్టొచ్చుకున్నారు. బాగానే ఉందనుకున్నారు కూడా. అకాల వర్షం రైతు వెన్నుమీద దెబ్బ కొట్టింది. పెట్టిన పెట్టుబడి గంగపాలు. గుండెల్లో కదుల్తున్న ఉత్తుంగ తరంగాలు కళ్ళలో చేరడాని కెంతోసేపు పట్టలేదు. మామగారి కంట పడకుండా అక్కణ్ణించి లేచి లోపల కెళ్ళిపోయింది.

** ** **

వర్షం తగ్గింది. గాలి జోరు తీసింది. ఆకాశంలో ఏడు గుర్రాల రథం సాఫీగా సాగిపోతోంది.

లేని సత్తువ తెచ్చుకుని విశ్వనాథం పొలం వైపు బయల్దేరాడు. వాగూ వంకా ఏకమయ్యాయి. తాటిమొద్దు మీదుగా కాలువలు దాటుకుంటూ అటువైపుకి వెళ్ళాడు. పొలాలన్నీ నీళ్ళతో సముద్రంలా ఉన్నాయి. తమ పొలం సమీస్తుండగా గట్టుమీద నిలబడున్న కొడుకుని చూసి ఆయన కడుపు తరుక్కుపోయింది. కాళ్ళూ, చేతులు తెగిన సైనికుడిలా నిస్సహాయంగా, దీనంగా ఉన్నాడు సుందరం. కొడుకు అరికాల్లో ముల్లు గుచ్చుకుంటే తన గుండెల్లో దిగబడినట్లు బాధపడత డాయన.

ఒక్కగా నొక్క కొడుకు. వయసు మళ్ళుతున్న సమయంలో లేక లేక పుట్టాడు. పురిట్లోనే భార్య పోతే, మళ్ళీ పెళ్ళి చేసుకోమని ఎందరు సలహా ఇచ్చినా వినకుండా కొడుకు కోసం బ్రతికాడు. సుందరం చిన్నతనంలో ఎప్పుడు చూసినా ఆయన చంకలోనే ఉండేవాడు. వాణ్ణెత్తుకునే ఆయన ఇంట్లో పని చక్కబెట్టుకుంటుంటే ఇరుగూ పొరుగూ అమ్మలక్కలు కన్నీళ్ళు పెట్టుకునేవారు. ఎవరైనా పసి పిల్లాణ్ణి ఎత్తుకోబోయినా ఆయన ఇష్టపడేవాడు కాదు. ఒక రోజు... రెండు రోజులు సాయానికి వస్తారు. మూడో రోజు మొహం



